# కలప వృక్షం ?

## కథానిక

### నిష్టల వెంకటరావు

ఈమధ్య పెంపకాలు ఎక్కువై పోయేయి. కొన్ని బేంకులు కొన్నిపల్లెల్ని (పిల్లల్ని కాదు) పెంచుకుంటే, మేం మరి రెండు ఆకులు ఎక్కువే చదువు కున్నాం అని కంపెనీలు కూడా గ్రామా లని పెంచుకుంటున్నాయి. చరణ సింగ్‌ని చెక్ చెయ్యడానికి అనుకోగలరు. నాట్ ఇన్ ది లీస్ట్. ఆ సింగు కేంద్రా నికి తిరువేంద్ర మంత దూరంలో వున్న ప్పుడే బిజినెస్ బిగ్‌పిగ్స్ పల్లెల్ని ఓకంట కనిపెడితే గాని ప్రమాదం అని వేసిన పథకం లాగుంది ఈ పెంపకం.

బికారీమల్ దోపిడీలాల్ ఓ ప్రఖ్యాత బిజినెస్ – ఇండస్ట్రియల్ మేగ్నేటు. అలనాడు లోటా లంగోటాతో బయల్దేరిన వాడు ఈనాడు ఇండియానే కొనగల అ(న)ంత కోటీశ్వరుడు. ఈ గురుడుకి ఉన్న మూడొందల కంపెనీలలో ఓ పెద్ద కంపెనీ ఓ(న)మాల పల్లెని పెంచు కుందికి దత్తత స్వీకార మహో త్సవ ప్రారంభోత్సవం తల పెట్టింది. గురూజీ స్వయంగా రిబ్బను తాము తెంపు తారు. అదీ గిరాకీ.

గురుడు గారు పంచ కట్టేరు. కళ్ళీ కమీజు ధరించేరు. అందరికి కనపడే లాగా తన బుర్ర మీద టోపీ పెట్టు కున్నారు. ఎవ్వరికీ కన పడని టోపీలు ఎందరికో పెట్టడానికే ఈ ప్రారంభో త్సవం. బికారీ మల్ జీ వేదిక నలంక రించేరు. అలంకరించిందే తడువు ఆల స్యం సహించని దోపిడీజీ ఉపన్యాస విన్యాసం మొదలెట్టారు. ఏమని ?

“హీ రోజు నుంచి ఇది తడి చెట్టుల నగర్. ఇక్డ మేమూ తడీ చెట్టులు హెన్ని నటించేం !. . . హి హ్హి హ్హి. . మేమూ తడీచెట్టులు ఎందుక్క నటించేం? చెబుతా యినండి. తడీ చెట్టు భూలోక్ కలప వృక్షమ్! కలప వృక్షమ్ మీకు తెల్దూ? తెల్సా! తటీ మాను అది దూలమ్ ఇంటిక్కి మెయిన్ పోల్! తటీ వాసమ్ తటీ పెండీబద్దు అంతా యిల్లూ కడ్తాదీ. తటీ ఆకూ రూఫ్ అవుతాదీ. తటీ మానూ ఆదా కాట్‌కె దొనె అవుతాది. దొనె తెల్దూ ? నీలు పారి దొనె ? తెల్సా ! తటీ ఆకూ సాపా అవుతాది. బట్ట అవు తాది” (అప్పుడే ఏపక్క నుంచో హడా విడిగా (తెలుగు బాగా) వచ్చిన మేనే జరు) “బట్ట నైజీ బుట్టా” అంటే, గురుజీ “హాఁ! హాఁ! బుట్టా. . . ఫిర్ కుఁవాసే నీలు తటీ బకెట్ లాగ్‌తాది. తటీ నరా రస్సీ (రస్సీనై తాడూ) హాఁ హాఁ తడూ అవుతాది. తటీ నరా మేము ఫారిన్కి జహాజ్‌ల ఎగ్స్‌పార్టీ చేస్తాం . . . తటీ మంజా (మంజా నై ముంజె) హాఁ హాఁ ముంజ్జికానేకా చీజ్ తటీ బల్లెం (బల్లెం నై బెల్లం) హాఁ హాఁ బెల్లం తటీ పానక్కం, తటీ ఈగా (ఈగా నై తేగా) హాఁ హాఁ తేగా. . . . జౌర్ తటీ ఫల్ . . . యేసబ్ కానేకా చీజ్ – మేము చెప్తం తిండిక్క తింటార్.

“తటీ ఫత్తర్ ఛత్తా అదీ గాడ్లు . . . హేఁ? పురుషమ్ పురాణ్ యితిహాస్ కలంమె తాటి ఫత్తర్ (ఫత్తర్‌నై ‘రేకు’ యా ‘కమ్మ’) హాఁ హాఁ. తటీ కమ్మ మే వేద్ పురాణ యితిహాస్ వుందీ. అత్‌మే తటీ మట్టా గిట్టా మికు పాయిలో కొయిలా – హేఁ? ఇన్నారా

తటీ చెట్టు జాస్తి వుప్ యోగమ్? అందుకే అదీ కలప వృక్షమ్ (కలప నై జీ 'కల్ప') హాఁ హాఁ కల్ప వృక్షమ్.. తటీ చెట్టుకి బాగ్ సేస్తే మీ గ్రామ్ బాగ్ అవుతాది.. తటీ కల్ పీనా మత్! అది ఒంటీక్ సెడ్డ. మత్మాగందీ ప్రొబెషన్, మొరార్జీయ్ ప్రొబెషన్... మీకూ తెల్సా దేశ్(య్)కి ఎంత పెరూ వుందీ ఫారిన్ మె?

"అఖర్ మె.. తడీ చెట్టూ పెద్ద చెయండీ, మి గ్రామ్ ప్రజ పెద్ద అవుతాదీ. సబ్ బోలో ... జైతడీ! జై గందీ! జై మొరా!"

కంపాలా నుంచి తెప్పించిన ఇంపాలా ఎక్కి దోపిడీలాల్‌గారు అతి జరుగురుగా తిరుగు ముఖం పట్టేరు. కారులోంచే ప్రజలకి వంక దండాలు పెడుతూ

* * *

బికారీ మల్ గారి షష్టిపూర్తి 60 రోజుల పాటు ఏకనాదంగా జరుగుతూంది. అందులో ఒక రోజు తాటిచెట్ల నగర్ ప్రజలు కానుకలు పట్టుకుని వచ్చేరు. కానుకలన్నీ సదరు తాటి చెట్టు భాగాల్లోంచి పనివాడితనంగా చేసినవే. సేఠ్జీ ఆ కానుకలన్నీ స్వయంగా పరిగ్రహించేరు. పరిగ్రహించి ఇతరులకి అర్థంకాని వారి రామ్వాడీ భాషలో ఆ తాటి సరకునంతా కార్నిష్ బోయిలర్‌లో పడేమని మేనెజర్జీకి చెప్పేరు! ఆ మాటలకి ఆ కానుకలని మ్యూజియంలో భద్రపరస్తారనుకున్నారు, పాపం ప్రజలు. బికారీమల్జీ ప్రజని భవనంలోకి రమ్మన్నాడు. ఆ భవనం చూస్తూవుంటే తాటి చెట్ల వాసులకి టాప్ లేచి పోతూంది. అమాయకంగా ప్రశ్నలు వేస్తున్నారు.

"ఇది ఏం టేబిల్ సార్?"

"ఇది మెహాగనీ టేబుల్. అమెరికాలో ఓ మహాగని వుంది. ఆ గనిలో దొరికే కఱ్ఱ మెహాగనీ." (మేనేజరు)

"ఇదేంటి సార్ ఇంత చిన్న కోటు?"

"అది మిక్ కోటు. (దాని ఖరీదు పదివేలు). సేట్ గారి భార్యగారు ఠండీ కాలం రెండ్రోజులు మాత్రం తొడుగుతారు దాన్ని" మేనేజరు జవాబు.

మెహాగనీ, మింక్‌కోట్, మార్బుల్ ఫ్లోరింగ్, అంతా అంతా అన్నీ అన్నీ మహా మహా ఖరీదు సామాన్లే కనపడుతున్నాయి, తాటి చెట్లనగర్ ప్రజలకి. వాళ్ళు ఎంత చూసినా దేని కోసం చూస్తున్నారో అది ఒక్కటీ కనపడ లేదు. చివరికి విసుగెత్తి దోపిడీ లాల్ గారినే డైరక్టుగా అడిగేరు.

"బాబూ తాడి చెట్టు బంగారం అన్నారు. కల్పవృక్షం అన్నారు. ఇంకెన్నో అన్నారు — ఈ భవంతిలో 'తాటి' ముచ్చుకైనా ఎందుకు లేదు?"

దోపిడీలాల్జీ తెల్లబోయినా లేనట్టు అతి చాకచక్యంగా నటించి...నవ్వి..

"హదీ సృష్టి మాయా మన చేతీలో ఏమ్లేదూ!

బోలో జై గందీకి జై మొరార్కీ!"

## కవితావేశం

జి. సి. జీవి

అర్ధరాత్రి మేలుకుని
అభ్యుదయ కవిత రాయాలని
ఆలోచించి ఆలోచించి
ఆవులింతలు తీస్తున్నప్పుడు
'అమ్మా ఆకలే' అనే
పక్క వాటాలోని
పసి పాప ఆక్రందన విని
నా కవితావేశం
విజృంభించ లేదు
చల్లారి పోయింది.